## మేడారం జాతరపై మాక్ జడ్పీ సమావేశం



కాసిపేట : మాక్ జడ్పీ సమావేశంలో పాల్గొన్న విద్యార్థులు

కాసిపేట, ఫిబ్రవరి 19 : ధర్మారావుపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం మేడారం జాతరపై మాక్ జడ్పీ సమావేశం నిర్వహించారు. జాతరలో జరుగుతున్న పర్యావరణ కాలుష్యం, తద్వారా తలెత్తే పరిణామాలు, ప్లాస్టిక్ వాడకంపై ఎదురయ్యే అనర్థాలు, అపరిచితులపై ఎలా ఉండాలనే విషయాలపై నిర్వహించిన సమావేశం ఆసక్తికరంగా సాగింది. విద్యార్థులు, తల్లిదండ్రులలో సామాజిక, పర్యావరణ స్పృహ కలిగించేలా ఈ కార్యక్రమం ఉందని హెచ్ఎం సుధాకర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, తిరుపతి, రాజేశం, లత, భాగ్యలక్ష్మి, నజియా, విద్యార్థులు పాల్గొన్నారు.

మందమర్రి రూరల్, ఫిబ్రవరి 19 : మండలంలోని ఆదర్శ పాఠశాలలో విద్యార్థులు మాక్ జడ్పీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులుగా పర్యావరణంపై చర్చ కొనసాగించారు. సమ్మక్క-సారక్క జాతరలో ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని, ప్లాస్టిక్ అనర్థాలపై చర్చించారు.

## టీపీఎఫ్‌జీఏ అధ్యక్షుడిగా మహేశ్



రామగిరి మహేశ్

బెల్లంపల్లిరూరల్, ఫిబ్రవరి 19 : తెలంగాణ ప్రొఫెషనల్ ఫిషరీస్ గ్రాడ్యుయేట్ అసోసియేషన్ (టీపీఎఫ్‌జీఏ) అధ్యక్షుడిగా బెల్లంపల్లికి చెందిన మత్స్య విభాగపు శాస్త్రవేత్త రామగిరి మహేశ్ నియామకమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో చేపల పెంపకానికి అధికంగా మంచినీటి వనరులున్నాయన్నారు. వ్యవసాయానికి పనికిరాని భూములను చేపల పెంపకానికి ఉపయోగిస్తే రైతు తన ఆదాయాన్ని రెట్టింపు చేసుకోవచ్చని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద రూ.26,050 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం ఉచిత చేప పిల్లల పంపిణీ ద్వారా ఆక్వా రైతులకు అండగా నిలుస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని మత్స్య రైతులకు చేపల పెంపకంలో ఏ సమస్యలు ఎదురైనా అందుబాటులో ఉండి పరిష్కరిస్తానన్నారు. ఏదైనా సమస్యలుంటే 91779 56005 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

## అభివృద్ధి పనులను కొనసాగించాలి



మందమర్రి మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మందమర్రి, ఫిబ్రవరి 19 : మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులోల చేపట్టిన అభివృద్ధి పనులను కొనసాగించాలని బీఆర్ఎస్ నాయకులు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లును కోరారు. సోమవారం మున్సిపల్ కమిషనర్‌ను నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో బతుకమ్మ ఘాట్లు, ఓపెన్ జిమ్‌లు, చిల్డ్రెన్ పార్కులతో పాటు పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఆ పనులు కొనసాగించి, పూర్తిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జె రవీందర్, సీనియర్ నాయకులు కొంగల తిరుపతి రెడ్డి, బండారు సూరిబాబు, ఈశ్వర్, బోరిగం వెంకటేశ్, మద్ది శంకర్, రాకం సంతోష్, తోట సురేందర్, భట్టు రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కరాటే పోటీల్లో ప్రతిభ




పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులతో మాస్టర్ భారతి

మంచిర్యాల అర్బన్, ఫిబ్రవరి 19 : ఛాంపియన్ కరాటే స్కూల్ ఆధ్వర్యంలో బెల్లంపల్లిలో ఆదివారం నిర్వహించిన 2వ జాతీయ స్థాయి కరాటే పోటీల్లో రామగిరి సృజన్, రామగిరి స్నేహిత్, ఆరాధ్య ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాలు సాధించారు. శ్రీరాంపూర్ కాలనీ, తీగల్ పహడ్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు తపస్వి, శివప్రియ, ఐశ్వర్య, స్పందన,అఖిల, నిత్య,శివాని, సంతోషి, మంచిర్యాలకు చెంది అయాన్ష్ భరత్, కార్తీక్ ద్వితీయ స్థానం సాధించారు. వీరిని గ్రాండ్ మాస్టర్లు అట్టె మధునయ్య, రవి, స్వామి, మాస్టర్ వడ్లకొండ భారతీ అభినందించారు.

## గాంధారి మైసమ్మ జాతర ఏర్పాట్ల పరిశీలన



ఖిల్లా పరిసరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 19 : క్యాతనపల్లి మున్సిపాలిటీ శివారులో ఈ నెల 23, 24, 25 తేదీల్లో జరిగే గాంధారి ఖిల్లా మైసమ్మ జాతర ఏర్పాట్లను చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి సోమవారం పరిశీలించారు. కలెక్టర్ బధావత్ సంతోష్‌తో ఫోన్లో మాట్లాడి, ఏర్పాట్లు త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయక్‌పోడు సేవా సంఘం, ఆలయ కమిటీ సభ్యులు గ్రామ కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు. అలాగే ఆర్కే-1ఏ సమీపంలోని పాలవాగు ఒడ్డున సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించే సమ్మక్క- సారక్క జాతర ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన వెట నాయకులు అబ్దుల్ అజీజ్, రఘునాథ్‌రెడ్డి, గోపతి రాజయ్య, పల్లెరాజు, పలిగిరి కనకరాజు, సత్యపాల్, వైస్ చైర్మన్ విద్యాసాగర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

**జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు..**

రామకృష్ణాపూర్ సింగరేణి ఠాగూర్ స్టేడియంలో కాకా వెంకటస్వామి స్మారక జిల్లాస్థాయి క్రికెట్ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. మున్సిపల్ చైర్ పర్సన్ జంగం కళ, వైస్ చైర్మన్ విద్యాసాగర్‌రెడ్డి, కాంగ్రెస్ పీసీసీ కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపతి రాజయ్య, పట్టణాధ్యక్షుడు పల్లె రాజు, సీనియర్ నాయకులు అబ్దుల్ అజీజ్, పలిగిరి కనకరాజు, క్రీడాకారులు పాల్గొన్నారు.



దండేపల్లి : ర్యాలీ తీస్తున్న యువకులు



తాండూర్ : అచ్చలాపూర్‌లో మహారాజ్‌కు నివాళులు



కోటపల్లి : పారుపల్లి గ్రామంలో..

# ఆదర్శనీయుడు శివాజీ మహారాజ్

- జిల్లా వ్యాప్తంగా ఛత్రపతి జయంతి వేడుకలు
- చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు.., ఘన నివాళులు..
- ఉత్సవ సమితి సభ్యులు, యువకుల ఆధ్వర్యంలో ర్యాలీలు

**ఛత్రపతి శివాజీ మహారాజ్ జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. దేశం కోసం పోరాడిన మహోన్నత వ్యక్తుల బాటలో యువత పయనించాలని సూచించారు. జిల్లాలో సోమవారం శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ సమితి సభ్యులు, యువకుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ర్యాలీలు తీశారు. మహారాజ్ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు.**



మంచిర్యాల అర్బన్ : ఛత్రపతి శివాజీ మహారాజ్‌కు నివాళులర్పిస్తున్న సభ్యులు

**మంచిర్యాలలో..**

మంచిర్యాల అర్బన్, ఫిబ్రవరి 19 : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బాలుర హై స్కూల్‌లో ఫిట్‌నెస్ సెంటర్, యోగోష్టమి ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. నేటి యువతరానికి ఛత్రపతి ఆదర్శమని, ఆయన మార్గంలో నడువాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రామయ్య, తుల ఆంజనేయులు, శ్రీనాథ్, లక్ష్మణ్, రాజేశ్వర్ రెడ్డి, చంద్రకాంత్, అశోక్, సంపత్, అష్టోత్తర యోగా సభ్యులు విజయ్, వేణు పాల్గొన్నారు.

**రక్తదానం...**

మంచిర్యాల ఏసీసీ, ఫిబ్రవరి 19 : ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకొని డైమండ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎర్రంశెట్టి సంతోష్ కుమార్ మంచిర్యాల ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రక్తనిధి కేంద్రంలో 52వ సారి రక్తదానం చేశారు. సొసైటీ జిల్లా చైర్మన్ కంకణాల బస్టర్, కోశాధికారి పడాల రవీందర్, గోస్కుల ఓదేలు, బుద్దె శ్రీను, రంజిత్, అమ్మానాన్న యూత్ అధ్యక్షురాలు తులాల శ్రీలత, సిబ్బంది పాల్గొన్నారు.

**జన్నారంలో..**

జన్నారం, ఫిబ్రవరి 19 : మండలంలోని కవ్వాల్ గ్రామానికి చెందిన ఛత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో పొనకల్, ఇందన్‌పెల్లి వరకు ర్యాలీ తీశారు. కవ్వాల్ గ్రామానికి చెందిన యూత్ సభ్యులు పాల్గొన్నారు.

**తాండూర్‌లో..**

తాండూర్, ఫిబ్రవరి 19 : తాండూర్ మండల ఛత్రపతి శివాజీ జయంతి ఉత్సవ సమితి, అచ్చలాపూర్‌లో యువత, సేవాజ్యోతి అనాథ శరణాలయంలో నిర్వాహకుల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. తాండూర్, ఐబీలో బైక్ ర్యాలీ తీశారు. ఆయా కార్యక్రమాల్లో శివాజీ జయంతి ఉత్సవ సమితి సభ్యులు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

**దండేపల్లిలో..**

దండేపల్లి, ఫిబ్రవరి 19 : మండల కేంద్రం నుంచి యువకులు బైక్ ర్యాలీ తీసి, కన్నేపల్లి చౌరస్తా వద్ద ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. వివిధ పార్టీల నాయకులు, యువకులు పాల్గొన్నారు.

**కోటపల్లిలో..**

కోటపల్లి, ఫిబ్రవరి 19 : మండలంలోని పారుపల్లి, లక్ష్మీపూర్‌లో శివాజీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఘనంగా నివాళులర్పించారు. ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని ముందుకుసాగాలని పిలుపునిచ్చారు.

**కాసిపేటలో..**

కాసిపేట, ఫిబ్రవరి 19 : కాసిపేట మండలం దేవాపూర్‌లోని అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో నాయక్‌పోడ్ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్ముల బాపు, అంబేద్కర్ సంఘం కోశాధికారి చిప్పకుర్తి రఘు, బుద్ధిస్ట్ సొసైటీ సభ్యులు రాజు పాలేకర్, రజని పాలేకర్, జ్యోతి, కవిత, తిరుపతి, ఐద్వా జిల్లా నాయకులు విజయ, ముడిమడుగుల బ్రహ్మయ్య పాల్గొన్నారు.



చెన్నూర్ : శోభాయాత్రలో నృత్యం చేస్తున్న యువకులు

**మందమర్రిలో..**

మందమర్రి రూరల్, ఫిబ్రవరి 19 : మందమర్రి పట్టణంలోని స్థానిక యూత్ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ తీశారు. బస్టాండ్ ప్రాంతం నుంచి పట్టణంలోని ప్రధాన రహదారి మీదుగా సాగింది. కార్యక్రమంలో దీక్షితులు, శివ, సంతోష్, పిట్టల సుధాకర్, సాగర్, ప్రసాద్, రమేశ్, రాజు పాల్గొన్నారు.

**చెన్నూర్‌లో..**

చెన్నూర్ టౌన్, ఫిబ్రవరి 19 : చెన్నూర్ పట్టణంలో ఉత్సవ సమితి ఆధ్వర్యంలో స్థానిక అయ్యప్ప స్వామి ఆలయం నుంచి పట్టణ పుర వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో గ్రామస్తులు, పార్టీలకతీతంగా నాయకులు పాల్గొన్నారు.

చెన్నూర్ రూరల్, ఫిబ్రవరి 19 : నాగాపూర్‌లో శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ముఖ్య అతిథులుగా ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నాగుర్ల వెంకటేశ్వర్లు, రాష్ట్ర అధ్యక్షుడు శెట్టిపల్లి శివాజీ, రాష్ట్ర కన్వీనర్ జెండా రాజేశ్, జిల్లా అధ్యక్షుడు చాప్లే రావూజీ, జిల్లా ప్రధాన కార్యదర్శి కుబిడె వెంకటేశ్వర్లు హాజరయ్యారు. మాజీ సర్పంచ్ అన్నల మానస తిరుపతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఇసుక రీచ్‌లో ట్రాక్టర్ల అడ్డగింత



ఖర్జీ ఇసుక రీచ్ వద్ద ట్రాక్టర్లను అడ్డుకున్న గ్రామస్తులు

నెన్నెల, ఫిబ్రవరి 19 : మైనింగ్ అధికారులు చేసిన తప్పిదంతో ట్రాక్టర్ యాజమానులు, కూలీలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. 17 రోజులుగా బంద్ ఉన్న రీచ్‌లోకి సోమవారం మైనింగ్ అధికారులు నెన్నెల, బెల్లంపల్లి, తాండూర్, కాసిపేట ట్రాక్టర్లకు అనుమతినిచ్చారు. మండలంలోని పలు గ్రామాల ట్రాక్టర్లకు అనుమతులివ్వకపోవడంతో సంబంధిత యజమానులు, డ్రైవర్లు, కూలీలు రీచ్ వద్దకు వెళ్లి, లోడింగ్‌ను అడ్డుకున్నారు. దీంతో ట్రాక్టర్ల యజమానులు, డ్రైవర్ల మధ్య గొడవలు జరిగాయి. ఒకరినొకరు నెట్టేసుకున్నారు. కాగా, రోడ్డు గుంతలు పడుతున్నా ఎవరూ పట్టించుకోవడంలేదని, 108 వచ్చినా ట్రాక్టర్ డ్రైవర్లు సైడ్ ఇవ్వడం లేదని ఖర్జీ, జంగాల్‌పేట గ్రామాల ప్రజలు డ్రైవర్లతో గొడవకు దిగారు. విషయం తెలుసుకున్న బెల్లంపల్లి రూరల్ సీఐ సఫియుద్దీన్, నెన్నెల ఎస్ఐ శ్యాంపటేల్, పోలీసులు ఇసుక రీచ్ వద్దకు చేరుకొని, పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేశారు. సంబంధిత జిల్లా మైనింగ్ అధికారులకు సీఐ ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ చేసుకున్నారు. యజమానులు, డ్రైవర్లతో మాట్లాడి గొడవలను ఆపారు. రీచ్ నుంచి పాత పద్ధతి ప్రకారం పర్మిషన్లు ఇవ్వాలని, అప్పుడే ట్రాక్టర్లను నడుపనిస్తామని డిమాండ్ చేశారు. రేపటి నుంచి వివాదం లేకుండా అన్ని ట్రాక్టర్లకు అనుమతి ఉంటేనే రీచ్‌కు రావాలని, అప్పటి వరకు ఇసుక బుక్ చేయవద్దని మైనింగ్ సిబ్బందిని సీఐ ఆదేశించారు. సుమారు ఐదు గంటల పాటు రీచ్ వద్ద వందలాది ట్రాక్టర్లు నిలిచిపోయాయి.

## మండలస్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్



దండేపల్లి : గెలుపొందిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

దండేపల్లి, ఫిబ్రవరి 19 : జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని భౌతిక, రసాయన, జీవశాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం సంయుక్తంగా మండలస్థాయి టాలెంట్ టెస్ట్‌ను సోమవారం దండేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆన్‌లైన్‌లో నిర్వహించారు. 8 పాఠశాలలు పాల్గొనగా, కొర్విచెల్మకు చెందిన అభిలాష్ (ప్రథమ), వెల్గనూర్‌కు చెందిన అక్షయ (ద్వితీయ), జస్విత్, సూర్యతేజ ప్రతిభ చూపారని ఇన్‌చార్జ్ హెచ్ఎం శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో సైన్స్ టాలెంట్ టెస్ట్ మండల కన్వీనర్లు అప్పాల మనోహర్, తిరుపతి, సంఘర్స్ రాజేశ్వర్ రావు, రమేశ్, నాగవర్మ, రాజన్న, నాగవర్మ, రాజన్న, వేణుగోపాల్, గఫూర్, రాజశేఖర్, వజ్రమ్మ, సీఆర్పీ నర్సయ్య పాల్గొన్నారు.

**కాసిపేటలో..**

కాసిపేట, ఫిబ్రవరి 19 : కాసిపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన టెస్ట్‌లో ధర్మారావుపేట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి కావ్యశ్రీ (ప్రథమ), మోడల్ స్కూల్ విద్యార్థి చంద్రహాసిణి(ద్వితీ), ధర్మారావుపేట పాఠశాల విద్యార్థి రిషిత గెలుపొందారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌బీఎస్‌టీ ఫోరం కన్వీనర్లు అన్నం రమణారెడ్డి, బండ శాంకరి, సైన్స్ ఉపాధ్యాయులు రాజేశం, చిన్నయ్య, స్వర్ణ, గణేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

**భీమారంలో..**

భీమారం, ఫిబ్రవరి 19 : భీమారం ఉన్నత పాఠశాలలో నిర్వహించిన టెస్ట్‌లో భీమారం, నర్సింగాపూర్, కేజీబీవీ, ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. భీమారం పాఠశాల విద్యార్థినులు వీ అంకిత, బీ ప్రణీత జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు విక్రమ్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో నర్సింగాపూర్ హెచ్ఎం సురేశ్, ఉపాధ్యాయులు ఎం శ్రీనివాసరావు, విగ్నేష్, చంద్రయ్య, రఘు, వీ కవిత, ఎం జ్యోతి, జ్యోతి, స్వప్న, హరికుమార్ తదితరులు పాల్గొన్నారు.

**జన్నారంలో..**

జన్నారం, ఫిబ్రవరి 19 : జన్నారం ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో నిర్వహించిన టెస్ట్‌లో కలమడుగు పాఠశాల విద్యార్థులు అంజన్‌కుమార్ (ప్రథమ), అశ్విక్ ఖాన్ (ద్వితీయ)స్థానంలో నిలిచారు. వారికి ఎంఈవో విజయ్‌కుమార్ బహుమతులను, జ్ఞాపికలు అందజేశారు. ఎంపికైన విద్యార్థులు జిల్లా కేంద్రంలో 20న జరిగే జిల్లాస్థాయి సైన్స్ టెస్ట్‌లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కట్ట రాజమౌళి, ఉపాధ్యాయులు అభినందించారు.



జన్నారం : విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంఈవో విజయ్‌కుమార్

## ప్రజావాణిలో అర్జీలు

చెన్నూర్, ఫిబ్రవరి 19 : చెన్నూర్ మున్సిపాల్ కార్యాలయంలో అధికారులు సోమవారం ప్రజావాణి నిర్వహించారు. మున్సిపాలిటీ మేనేజర్ లలిత, ఏఈ సాయికిరణ్, జూనియర్ అసిస్టెంట్లు వెంకటేశ్, రాజ్‌కుమార్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. రెండు అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

**తాండూర్‌లో..**

తాండూర్, ఫిబ్రవరి 19 : మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పీ శ్రీనివాస్, తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, ఎంపీవో సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రజావాణి నిర్వహించారు. పలువురు తమ సమస్యలపై చేసుకున్న దరఖాస్తులను సంబంధిత శాఖల వారీగా పరిశీలించి, పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

**చెన్నూర్‌లో..**

చెన్నూర్ టౌన్, ఫిబ్రవరి 19 : చెన్నూర్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎం మోహన్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో ఎండీ అజ్మత్ అలీ, తహసీల్దార్ ఈ మల్లికార్జున్, డిప్యూటీ తహసీల్దార్ (రెవెన్యూ) సనత్ కుమార్, చెన్నూర్ సబ్ డివిజన్ ఏఈఈ కే శ్రీనివాస్, కొమ్మెర ఏఈఈ ఎస్ భాస్కర్, ఐకేపీ ఏపీఎం బీ ప్రమీల, ఉపాధి హామీ ఏపీవో జీ గంగాభవాని, ఎంఈవో కే రాధాకృష్ణమూర్తి, సీడీపీవో వీ మనోరమ, వ్యవసాయాధికారి (ఎఫ్ఏసీ) మార్క్ గ్లాడ్‌స్టన్, పశువైద్యాధికారి టీ శ్రీనివాస్, పీఆర్ ఏఈ శివకుమార్, నీటిపారుదల శాఖ ఏఈ జే చేతన్, ఎంబీ గ్రిడ్ ఏఈ ఎన్ వివేక్, సెరికల్చర్ అధికారి బీ వెంకన్న, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ ఏ సరిత, వైద్యాధికారి ఏ కృష్ణ తేజ, అధికారులు పాల్గొన్నారు.

## వేలాల మల్లిఖార్జున స్వామి జాతర వేలం

జైపూర్, ఫిబ్రవరి 19 : మహా శివరాత్రి శివరాత్రిని పురస్కరించుకొని జైపూర్ మండలం వేలాల శ్రీ మల్లిఖార్జున స్వామి జాతర సందర్భంగా సోమవారం వేలం నిర్వహించారు. పార్కింగ్ నిర్వహణ, కొబ్బరికాయలు, ప్యాలాల విక్రయానికి బహిరంగ వేలం చేపట్టారు. పార్కింగ్‌కు తిరుపతి గౌడ్ రూ.3,22,000కు, కొబ్బరికాయల విక్రయాలకు సుందిళ్ల దేవయ్య రూ.4,45,000, ప్యాలాల విక్రయాలకు అనిల్ కుమార్ రూ.55,000కు వేలం దక్కించుకున్నారు. ఎంపీడీవో జీ సత్యనారాయణ, ఎంపీవో అనిల్ కుమార్, గ్రామ ప్రత్యేకాధికారి ఏ విద్యాసాగర్, గౌరవ ప్రత్యేక అధికారి, ఆలయ ఈవో రమేశ్, ఎంపీటీసీ బుడే రాజేశ్వరి, కార్యదర్శి ఎస్ రాకేశ్, ప్రజా ప్రనిధులు పాల్గొన్నారు.

## మట్టి ఆరోగ్య కార్డుల పంపిణీ

బెల్లంపల్లిరూరల్, ఫిబ్రవరి 19 : జాతీయ మట్టి ఆరోగ్య కార్డుల దినోత్సవం సందర్భంగా బెల్లంపల్లి మండలంలోని పాత బెల్లంపల్లిలో సోమవారం జగిత్యాల వ్యవసాయ కళాశాల విద్యార్థులు పరీక్షలు చేసిన మట్టి ఆరోగ్య కార్డులను ఎమ్మెల్యే వినోద్ రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాయలింగు, బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కార్కూరి రాంచందర్, బెల్లంపల్లి వ్యవసాయాధికారి వందన, కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కోట శివకృష్ణ, జగిత్యాల వ్యవసాయ కళాశాల విద్యార్థులు ముత్యం తిరుపతి, అనీల్, అరవింద్, చందన, అర్చన తదితరులు పాల్గొన్నారు.

## నేడు వేమనపల్లి మండల సర్వసభ్య సమావేశం

వేమనపల్లి, ఫిబ్రవరి 19 : వేమనపల్లి మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరవ్వాలని సూచించారు.

## స్మశానవాటికలో నీటి సరఫరా

బెల్లంపల్లి, ఫిబ్రవరి 19 : మున్సిపాలిటీ పరిధిలోని కన్నాలబస్తీ స్మశానవాటిక ఆవరణలో నీటి సరఫరాను సోమవారం మున్సిపల్ కమిషనర్ గోపు మల్లారెడ్డి ప్రారంభించారు. అంత్యక్రియల అనంతరం స్నానాలు చేసేందుకు పంపులను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. టేకుల బస్తీ, కాంట్రాక్టర్ బస్తీ, 1, 2, 14వ వార్డుల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జాతరకు ఏర్పాట్లు

కోటపల్లి, ఫిబ్రవరి 19 : నక్కలపల్లి, మల్లంపేట, రాపనపల్లి గ్రామాల్లో సమ్మక్క-సారలమ్మ జాతరకు ఏర్పాట్లు చేస్తున్నారు. మేడారం వెళ్లలేని చుట్టు పక్కల గ్రామాల భక్తులు ఇక్కడికి పెద్ద సంఖ్యలో తరలిరానున్నారు. కాగా, అమ్మవార్లను ప్రతిష్ఠించే గద్దెల వద్ద ఏర్పాట్లు చేస్తున్నారు.

## మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

కాసిపేట, ఫిబ్రవరి 19 : కాసిపేట తెలంగాణ మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ అందె నాగ మల్లయ్య తెలిపారు. 6వ తరగతిలో 100 సీట్లు, 7, 8, 9, 10వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల కోసం ఫిబ్రవరి 22వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఇంగ్లిష్ మీడియంలో నాణ్యమైన విద్యాబోధన ఉచితంగా ఉంటుందని, అన్ని రకాల సదుపాయాలు, వసతులు ఉంటాయని వివరించారు. వివరాలకు 95509 32264 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

## భర్త రిమాండ్..

కాసిపేట, ఫిబ్రవరి 19 : కాసిపేట మండలం కోమటిచేను గ్రామంలో భార్య, కొడుకుపై హత్యకు ప్రయత్నించిన గెడం వెంకటేశ్వర్‌ను రిమాండ్ చేసినట్లు ఎస్ఐ గంగారాం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం. కోమటిచేను గ్రామానికి చెందిన గెడం వసంత, తన కొడుకుతో కలిసి ఆదివారం రాత్రి రేకుల షెడ్డులో నిద్రపోతున్నారు. ఈ క్రమంలో భర్త వెంకటేశ్వర్ వారిపై డీజిల్ పోసి, నిప్పుపెట్టేందుకు యత్నించాడు. ఈ మేరకు వసంత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. వెంకటేశ్వర్‌ను అదుపులోకి తీసుకొని రిమాండ్ చేసి, బెల్లంపల్లి కోర్టులో ప్రవేశపెట్టగా, జడ్జి ఆదేశాలతో రిమాండ్ నిమిత్తం ఆసిఫాబాద్ సబ్ జైలుకు తరలించినట్లు వివరించారు.

## 40 మందిపై పిచ్చికుక్క దాడి

మంచిర్యాల ఏసీసీ, ఫిబ్రవరి 19 : మంచిర్యాల పట్టణంలోని రామ్‌నగర్, ఎల్ఐసీ కాలనీలో సోమవారం పిచ్చి కుక్క రెచ్చిపోయింది. ఒకేసారి 40 మందిపై దాడి చేసి, గాయపర్చింది. మంచిర్యాలలోని ప్రభుత్వ దవాఖానలో చేరారు. రెండు రోజుల క్రితమే పిచ్చికుక్క కాలనీల్లో తిరుగుతుందని మున్సిపల్ అధికారులకు సమాచారం అందించినప్పటికీ వారు పట్టించుకోలేదని, గతంలోనూ పిచ్చి కుక్కలు కాలనీల్లో తిరుగుతూ దాడి చేసినట్లు బాధితులు తెలిపారు. పిచ్చి కుక్కలను వార్డుల్లో తిరగకుండా చూడాలని కోరారు.

## ఎన్నికలకు సిద్ధం

మంచిర్యాల అర్బన్, ఫిబ్రవరి 19 : పార్లమెంట్ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందని రాష్ట్ర సీనియర్ అధికార ప్రతినిధి చీటి ఉమేశ్ అన్నారు. మంచిర్యాలలో ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ఇంట్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతామని తెలిపారు.

## సదరం శిబిరం



పరీక్షలు చేస్తున్న వైద్యుడు ప్రవీణ్

మంచిర్యాల ఏసీసీ, ఫిబ్రవరి 19 : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో ఆర్థో విభాగానికి సంబంధించి సదరం శిబిరం నిర్వహించారు. ఆఫ్‌లైన్‌లో 50 మంది స్లాట్ బుక్ చేసుకోగా, అందరూ హాజరయ్యారు. ఆర్థో వైద్యుడు పర్వీణ్ పరీక్షలు చేశారు. అర్హులకు సర్టిఫికెట్లు త్వరతో రానున్నట్లు వివరించారు.

## సమస్యలు పరిష్కరించాలి

మంచిర్యాల అర్బన్, ఫిబ్రవరి 19 : కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలపై సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ ఉద్యోగుల బదిలీలు, ఉద్యోగోన్నతులు వెంటనే చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సంకె రవి, అంగన్‌వాడీ ఉద్యోగులు, సీఐటీయూ నాయకులు శారదా, ప్రవీణ, దుర్గ, మణిమల, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు



మాట్లాడుతున్న దుంపల రంజిత్